www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 4 అక్టోబర్ 2023



6న జగనన్నకు చెబుదాం : ఎంపిడిఓ

ప్రజాశక్తి- యాదమరి: ఈనెల 6వ తేదీ శుక్రవారం మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండలస్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి శివరాజ్ మంగళవారం ఓ ప్రకటనలతో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 6వ తేదీ శుక్రవారం యాదమరి మండలం ఎంపిడిఓ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రత్యేక అధికారులు, మండల, గ్రామస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

28న ప్రజారక్షణ భేరి

బస్సు జాతాను జయప్రదం చేయండి : సిపిఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మోడీఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య హక్కులు, ప్రజారక్షణకు మరో చారిత్రాత్మక పోరాటం నిర్వహించాల్సిన సమయం వచ్చిందని సిపిఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు అన్నారు. మంగళవారం సిపిఎం కార్యాలయంలో జరిగిన జిల్లా సమావేశానికి కె.సురేంద్రన్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు హాజరై మాట్లాడారు. ఎమర్జెన్సీ కాలంలో నాయకులను జైళ్లలో పెట్టినప్పుడు, 1984లో ఎన్‌టిఆర్‌ను అప్రజాస్వామికంగా పదవీచ్యుతుడిని చేసినప్పుడు... ఇలా అనేక సందర్భాల్లో చారిత్రాత్మక ఉద్యమాలు ఆవిర్భవించాయని తెలిపారు. ప్రజాసామ్యహక్కులను, ప్రజాఉద్యమాలను రక్షించుకునేందుకు నవంబరు 7వ తేదీన 'ప్రజారక్షణ భేరి' ద్వారా సిపిఎం సన్నద్ధమైందన్నారు. అక్టోబర్ 2 గాంధీ జయంతితో ప్రారంభమై బస్సు జాతా నవంబర్ 7 సోవియట్ విప్లవ దినోత్సవం వరకు సాగుతుందన్నారు. దేశం, రాష్ట్రంలో ప్రజాస్వామ్యహక్కులు హరించి వేయబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాఉద్యమాలు, ప్రజాసంఘాలపై దాడులు, నిర్బంధాలు పెరిగిపోయాయని చెప్పారు. ఇందుకు పాలకులు నిఘా వ్యవస్థలను సైతం వినియోగించుకుంటున్నారని అన్నారు. హిట్లర్ కూడా తన నిఘా వ్యవస్థ ద్వారా మారణహోమం సృష్టించాడని గుర్తు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థే ప్రమాదంలో పడిందన్నారు. రాష్ట్రాల హక్కులపై కేంద్రం దాడి చేస్తోందన్నారు. దీనికి ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వంపై కేంద్రం పెత్తనమే నిదర్శనమన్నారు. ప్రాంతీయ పార్టీలను విచ్ఛిన్నం చేయడం, ఇడి, సిబిఐ, ఐటి దాడుల ద్వారా విపక్ష నేతలను భయపెట్టడం ద్వారా ఆయా రాష్ట్రాల్లో విస్తరణకు బిజెపి ప్రయత్నిస్తోందన్నారు. పదేళ్ల క్రితం పార్లమెంట్‌కు వచ్చిన మహిళా బిల్లును సమర్థించని బిజెపి... ఇప్పుడు దానిని ఆమోదించి తన గొప్పగా చెప్పుకుని లబ్ధిపొందాలని చూస్తోందన్నారు. కానీ మహిళా చట్టాన్ని మాత్రం వెంటనే అమలు చేస్తామని చెప్పలేకపోతోందన్నారు. దీంతో ఈచట్టం ఎప్పుడు అమలులోకి వస్తుందో చెప్పలేని పరిస్థితి నెలకొందన్నారు. యువతరంలో ఉన్మాదాన్ని రెచ్చగొట్టడం ద్వారా ప్రజల ఆలోచనను మూఢనమ్మకాల వైపు మళ్లిస్తోందన్నారు. మూఢనమ్మకాలను సాంకేతిక విజ్ఞానంతో మిళితం చేస్తోందన్నారు. మణిపూర్ ఘటనలు, రెజ్లర్ల ఆందోళనలపై నోరుమెదపని ప్రధాని మోడీ....సనాతన ధర్మంపై ఉదయ నిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలపై మాత్రం ఆగమేఘాల మీదు విరుచుకుపడ్డారని అన్నారు. వివక్ష, అణచివేతకు ప్రతిరూపమే సనాతన ధర్మమన్నారు. కానీ బిజెపి సనాతన ధర్మం పేరుతో వచ్చే ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు మతాల మధ్య చిచ్చు రేపుతోందని విమర్శించారు. ప్రజాస్వామిక చట్టాలను ఉల్లంఘిస్తోందన్నారు. 'ఇండియా ఐక్య వేదికను చూసి ఓటిమోత మోగుతున్న బిజెపి.. చివరకు దేశం పేరునే మార్చడానికి సిద్ధమైందన్నారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు మాట్లాడుతూ మోడీ వత్తాసుతోనే జగన్ ప్రజలపై భారాలు మోపుతున్నాడని, అడ్డగోలు పాలన సాగిస్తున్నాడని మోడీని ఓడిస్తేనే జగన్ పాలన అంతమవుతుందని అన్నారు. టిడిపి పతనమే బిజెపి లక్ష్యమన్న వాస్తవాన్ని గుర్తించకుండా మోడీ వెంటపడుతోందని విమర్శించారు. అనేక రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలను బిజెపి మింగేసిందన్నారు. కేంద్రం వత్తిడికి తలొగ్గిన రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై అనేక రూపాల్లో విద్యుత్ భారాలు మోపుతోందని విమర్శించారు. స్కిల్ స్కాం కేసులో బిజెపి సహకారం లేకుండా టిడిపి అధినేత చంద్రబాబును అరెస్టు చేసే పరిస్థితిలేదన్నారు. ఈ స్కాంపై ముందుగా ఉప్పందించిన బిజెపి ఆ తర్వాత తమకు సంబంధంలేనట్లుగా నటిస్తోందన్నారు. జిల్లాలో 28న జరిగే ప్రజారక్షణ భేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు గిరిధర్ గుప్తా, ఓబులురాజు, భువనేశ్వరి బాలసుబ్రమణ్యం, రాజేష్ వరలక్ష్మి,దాము పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు జగనన్న ఆరోగ్య సురక్ష

క్షేత్రస్థాయిలో పకడ్బందీగా నిర్వహించండి : డిప్యూటీ సిఎం



జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన వినూత్న కార్యక్రమం జగనన్న ఆరోగ్య సురక్ష అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎక్సైజ్ శాఖ మంత్రి కె. నారాయణ స్వామి పేర్కొన్నారు. మంగళవారం జెడ్పి సమావేశపు మందిరమైన వైఎస్ఆర్ సభావేదికలో జెడ్పి ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన జెడ్పి సాధారణ సర్వసభ్య సమావేశానికి ఉప ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర అటవీ, విద్యుత్, పర్యావరణ శాస్త్రసాంకేతిక భూగర్భ గనులశాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. వారి వెంట చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డప్ప, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, ఎంఎల్‌సి భరత్, చిత్తూరు, తంబళ్ళపల్లి ఎంఎల్‌ఏలు ఆరణి శ్రీనివాసులు, పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, జడ్పీ వైస్‌చైర్మన్ రమ్య, ధనుంజయ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. డిప్యూటీ సిఎం మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్య శాఖ క్షేత్ర స్థాయిలో సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి ఇంటిని, ప్రతి వ్యక్తి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకుని అందుకు అనుగుణంగా వారికి అవసరమైన వైద్యచికిత్సలు అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. దేశంలో ఏరాష్ట్రం లోనూ ప్రజల ఆరోగ్య స్థితిగతులకు సంబంధించి ప్రత్యేక శ్రద్ధచూపి వ్యాధి నిర్ధారణతో పాటు మందుల పంపిణీ జరగడం లేదని, ఇంతటి బహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతూ, వైద్య వత్తిని అభ్యసించి డాక్టర్లుగా ఉన్న వారికే మార్గదర్శకం చూపే విధంగా ఈ కార్యక్రమం గురించి వివరించడం జరుగుతున్నదన్నారు. నాడు- నేడు క్రింద చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ జిల్లా గహనిర్మాణ పురోగతిలో ప్రథమ స్థానంలో ఉందని ఇది ఇలాగే కొనసాగిస్తామన్నారు. అలాగే ఇళ్ల నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారుల పట్టాలను రద్దు చేసి అర్హులైన వారికి మంజూరు చేసి ఇంటి నిర్మాణాలు జరిగేలా అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలని తెలిపారు. జెడ్పి ఛైర్మన్ మాట్లాడుతూ జిల్లా పరిషత్‌లో కారుణ్య నియామకాలకు సంబంధించి జిల్లాకు చెందిన మంత్రులు, జిల్లా కలెక్టర్ ద్వారా గ్రామ, వార్డు సచివాలయాలలో ఉద్యోగ నియామకాలను చేపట్టామని తెలిపారు. మండల పరిధిలో తాగునీటి కొరతను ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ సహకారంతో పరిష్కరించడం జరిగిందన్నారు. వివిధ అభివద్ధి పథకాల కొరకు రెండు సంవత్సర కాలంలో దాదాపు రూ.70 కోట్లు మంజూరు చేసి 70 శాతం పనులను పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన పనులను సకాలంలో పూర్తిచేయాలని అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఎంఎల్‌సి మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గానికి మరి కొన్ని ఇల్లు మంజూరు చేయాలని తెలిపారు. సమావేశంలో తిరుపతి డిఆర్‌ఓ పెంచల కిషోర్, రాష్ట్ర జానపదకళల అభివద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొండవీటి నాగభూషణం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ జోనల్ చైర్మన్ శైలజా రెడ్డి, పికె ఎం ఉడా చైర్మన్ వెంకట్ రెడ్డి యాదవ్, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికారులు- ఇరిగేషన్, పిఆర్, ఆర్ అండ్‌బి ఎస్‌ఈలు విజయ్ కుమార్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ఉమామహేశ్వర రెడ్డి, హౌసింగ్ పీడీ పద్మనాభం, డిఆర్‌డిఏ, డ్వామా, మెప్మా, ఐసిడిఎస్ పిడిలు తులసి, గంగాభవానీ, రాధమ్మ, నాగశైలజా, వ్యవసాయ ఉద్యాన, పశుసంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

నగరి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజారోగ్యానికి సర్కారు ఇచ్చిన రక్ష అని రాష్ట్రపర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. మంగళవారం మండలంలోని బీరకుప్పం గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ పేదలందరికీ కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. ఎంపీపీ భార్గవి, వైస్‌ఎంపీపీలు కన్నియప్ప, ఢిల్లీ, ఎంపీడీవో లీలా మాధవి, సీడీపీవో కష్ణవేణి, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ హరి, ఎంపీటీసీ తులసి, సర్పంచులు సెల్వి, మోహన్ పాల్గొన్నారు.



నగరిలో మంత్రి రోజా

మాపాక్షిలో జగనన్న ఆరోగ్య సురక్ష

చిత్తూరుఅర్బన్ : ఆరోగ్యమే మహాభాగ్యం అని, ఆరోగ్యంగా ఉంటే అంతకుమించిన అదష్టం ఏదీ లేదని నగర మేయర్ ఎస్.అముద, కమిషనర్ డాక్టర్ జె.అరుణ చెప్పారు. చిత్తూరు నగరపాలక సంస్థ మాపాక్షి పట్టణ ఆరోగ్యం కేంద్రం పరిధిలో స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మేయర్, కమిషనర్ ప్రారంభించారు. మంగళవారం మాపాక్షి పాఠశాల ఆవరణలో నిర్వహించిన వైద్య శిబిరానికి భారీగా ప్రజలు తరలివచ్చి వైద్య సేవలను పొందారని తెలిపారు. వైద్య శిబిరంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పౌష్టికాహారం స్టాల్స్ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, స్థానిక వార్డు కార్పొరేటర్లు బాబు, మధుబాబు, సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నగర మేయర్ అముద



పెద్దపంజాణి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ రెడ్డప్ప అన్నారు. మంగళవారం మండలంలోని కోగిలేరు సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ లోకేశ్వరరావు, వైస్ ఎంపీపీ అంజమ్మ, కోఆప్షన్ సభ్యుడు రహమతుల్లా, ఎంపీడీవో అబ్దుల్ రహీం, ప్రత్యేక అధికారి రవి, సర్పంచ్ రమేష్ బాబు, ఎంపీటీసీ పరందామ పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: తీర్థం గడ్డురు ప్రాథమిక పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కె.అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్లు శిక్షర రెడ్డి, డాక్టర్ మాధవి, మెడికల్ ఆఫీసర్ శాలిని, పిహెచ్‌సి డాక్టర్ పద్మావతి, డాక్టర్ అపర్ణ పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ ఆరోగ్యవంతమైన జీవితం లభిస్తుందని ఎంపీపీ అనిత, జడ్పీటీసీ లక్ష్మి ప్రియ, ఎంపీడీవో శ్రీదేవి అన్నారు. మంగళవారం మండలంలోని అగరమంగళం గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అధికారులతో కలిసి ఎంపీపీ ప్రారంభించారు. ఈసందర్భంగా ఐసిడిఎస్ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాటీ టీచర్లు పౌష్టికాహారం స్టాల్‌ను ఏర్పాటు చేశారు. వైద్యులు దుర్గాదేవి, దివ్య, తహశీల్దార్ ఇన్బనాధన్, సర్పంచ్ సరోజమ్మ, ఐసిడిఎస్ సూపర్వైజర్లు సంగీత, నాగరత్నమ్మ, పంచాయతీ కార్యదర్శి సుమయ పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: గ్రామీణ ప్రాంతవాసులకు కార్పొరేట్ వైద్యం అందించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం చేపడుతున్నట్టు జడ్పిటిసి సోమశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని జిల్లేడుపల్లి సచివాలయం తంబుగానుపల్లి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రాథమిక వైద్యులు లోహిత్ చెంగల్ రాయలు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం వద్ధులకు ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేపట్టారు. వైస్‌ఎంపీపీ శిరీష్ రెడ్డి, సర్పంచ్ భారతి, ఎంపీటీసీ శంకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రకాష్‌రెడ్డి, ఇంచార్జ్ తహశీల్దార్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

కార్వేటినగరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మోహన్ మురళి, వైద్యాధికారి డాక్టర్ గోపీనాథ్ తెలిపారు. మంగళవారం అన్నూరు సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లో ఉచితంగా ట్రీట్మెంట్ తీసుకోవాలన్నారు. సర్పంచ్ సుందర్ రాజ్, సింగల్ విండో అధ్యక్షులు లోకనాథరెడ్డి, హేమశ్రీ, మురళి, తిరుమలేష్, తహశీల్దార్ రవికుమార్, గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది వైద్యసిబ్బంది ఉన్నారు.



బంగారుపాళ్యంలో..

గంగవరం: మండలంలోని గుండిగల్లు గ్రామపంచాయతీలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించినట్లు ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ వైద్యశిబిరంలో సుమారు 250 మందికి వైద్య చికిత్సలతోపాటు మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఎంపీపీ వెంకటరమణ, సర్పంచ్ రమణ పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం: పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో కష్ణయ్య, తహశీల్దార్ లోకనాథ పిల్లై, చిత్తూరు డిఎంహెచ్వో డాక్టర్ రవిరాజ్ అన్నారు. మండలంలోని కటికపల్లి గ్రామపంచాయతీ కటికపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంను సర్పంచ్ మార్కొండయ్య, డీకే మర్రిపల్లి నాయకులు సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్ఆర్ పురం వైద్యాధికారి డాక్టర్ పల్లవి, డాక్టర్ బాలసుబ్రమణ్యం రెడ్డి , డాక్టర్ గౌరీ, చిత్తూరు ప్రభుత్వాసుపత్రి ఆర్థో డాక్టర్ ఆసీస్ పాల్గొన్నారు.



గంగవరంలో..

అందరికీ సంక్షేమ పథకాలు అందాలి

జెడ్పి ఛైర్మెన్ శ్రీనివాసులు



జెడ్పిటీసీల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పి ఛైర్మెన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్థానిక జెడ్పి ఛైర్మెన్ ఛాంబర్‌లో మంగళవారం తంబళ్లపల్లి నియోజకవర్గపు కురబలకోట, పెద్దమండ్యం, తంబళ్లపల్లి, మొలకల చెరువు, బి.కొత్తకోట మండముల జడ్పిటీసీలు, ఎంపిపిలతో జెడ్పి ఛైర్మెన్ గోవిందప్ప శ్రీనివాసులు సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలు, నవరత్నాలు, సంక్షేమ పథకాల అమలుపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం పెండింగ్‌లో వున్న పనులను త్వరతగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను చిత్తూరు జడ్పీ ఛైర్మెన్ శ్రీనివాసులు తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి , జడ్పీ సీఈఓ ప్రభాకర రెడ్డి ఆదేశించారు.

నేడు కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని నగర మేయర్ ఎస్.అముద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశమందిరంలో జరిగే ఈ సమావేశానికి ఎక్స్ అఫిషియో సభ్యులు, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు హాజరుకావాలని కోరారు.

మురుగు కాదు.. ఊట నీరు..

ప్రజాశక్తి వార్తకు స్పందించిన సర్పంచ్ వెంకటరెడ్డి

ప్రజాశక్తి- సోమల

వర్షపు నీరు కాదు.. మురుగు నీరు అన్న వార్త ఈనెల రెండవ తేదీ ప్రజాశక్తిలో ప్రచురితమైన సంగతి తెలిసిందే. వార్తపై స్పందించిన నంజంపేట సర్పంచ్ వెంకటరెడ్డి ప్రజాశక్తితో మాట్లాడుతూ గోతులు పడిన ప్రదేశం నీరు ఊరే ప్రదేశం కాబట్టి గ్రామంలో ఇండ్ల చుట్టూ నుండి వచ్చే ఊట నీరు రోడ్డుపై నిలచి గోతులు ఏర్ప పడుతున్నాయని తెలిపారు. సరస్వతీపురంలో మురుగునీటి కాలువల నిర్మాణం కోసం నిధులు మంజూరు అయ్యాయని అయితే ఆర్‌అండ్ బి వారు రోడ్డు పనులు చేసి వారికి ఎంత మేర రోడ్డు వెడల్పు ఉందో అంతమేర రోడ్డు వేస్తే తరువాత కాలువలు నిర్మిద్దామని వేచి ఉన్నామని తెలిపారు. ఆర్ అండ్ బి వారి రోడ్డు పనులు కాగానే కాలువల నిర్మాణం చేపట్టి మురుగునీరు సజావుగా వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రోడ్డుపై ఏర్పడిన గుంతలలో నీరు చేరిందే తప్ప మురుగునీరు కాదని వివరణ ఇచ్చారు. ఉప సర్పంచ్ ముబారక్ మాట్లాడుతూ ఇటీవల రోడ్డుపై గుంతలలో మట్టి తోలించడం కూడా జరిగిందని అయితే మళ్లీ వర్షం పడ్డంతో మట్టి కొట్టుకుపోయి గుంతలు ఏర్పడ్డాయని తెలిపారు. ఏది ఏమైనా ఆర్ అండ్ బి వారు రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకొని రోడ్డుపై గుంతలు లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన కలెక్టర్



ప్రజాశక్తి- పుంగనూరు

పేదలందరికి ఇళ్లు కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న గహనిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ పేర్కొన్నారు. మండలంలోని గూడూరుపల్లి వద్ద హౌసింగ్ లేఅవుట్ లో జరుగుతున్న ఇండ్ల నిర్మాణ పనులను, అర్బన్‌లో పూర్తి అయిన టిడ్కో గహాలను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పేదలందరికీ ఇల్లు కార్యక్రమంలో భాగంగా ఇండ్లు మంజూరైన లబ్ధిదారులందరూ ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని గహప్రవేశాలకు సిద్ధం కావాలని తెలిపారు. పెండింగ్ ఉన్న పనులు హౌసింగ్ అధికారులు త్వరితగతిన పూర్తి చేసేలా ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ పద్మనాభం, పిఆర్‌ఎస్‌ఈ చంద్రశేఖర్ రెడ్డి, మెప్మా పిడి రాధమ్మ, మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్, తహసీల్దార్ సీతారాం, ఎంపీడీవో నారాయణ నాయక్, గహనిర్మాణ శాఖ అర్బన్, రూరల్ ఏఈలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు కేసీ తేజేష్

అభినందించిన క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా

ప్రజాశక్తి- నగరి



స్థానికంగా క్రీడాకారులను ప్రోత్సహించడానికి మంత్రి ఆర్కేరోజా తరచూ నిర్వహిస్తున్న శిక్షణా శిబిరాలు, పోటీలు నిర్వహిస్తూ అందిస్తున్న సహకారం వారు క్రీడల్లో ఉన్నతిని సాధించడానికి ఉపయోగపడుతోంది. ఇటీవల నంద్యాల జిల్లా మహానందిలో నిర్వహించిన సబ్‌జూనియర్ బాల్‌బాడ్మింటన్ పోటీల్లో జిల్లా జట్టు ప్రతిభ చూపగా అందులో నగరి పట్టణానికి చెందిన వశిష్ట విద్యాలయ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కెసి తేజేష్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. మంగళవారం తన నివాస కార్యాలయం వద్ద జిల్లాటీం క్రీడాకారులను, జాతీయ పోటీలకు ఎంపికైన కేసీ తేజేష్‌ను మంత్రి రోజా అభినందించారు. ఈ సందర్భంగా కోచ్ గోపి మాట్లాడుతూ జిల్లా నుంచి అంతర్‌రాష్ట్ర పోటీలకు వెళ్లిన టీం బాగా రాణించిందని మంత్రికి తెలియపరిచారు. జిల్లా టీంలో ప్రతిభ చూపిన కేసీ తేజేష్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. ఈ నెల 15 నుంచి 19 వరకు ఛత్తీష్‌గడ్ రాష్ట్ర బిలాయ్, బీఎస్‌పీ బాల్ బ్యాడ్మింటన్ స్పోర్ట్స్ క్యాంపస్‌లో జరిగే జాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనున్నాడన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్రీడలకు తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని దాన్ని సద్వినియోగం చేసుకొని క్రీడాకారులు రాణించాలని అన్నారు. పీఈటీ పాండియన్, జిల్లా బ్యాడ్మింటన్ క్రీడాకారులు ఇగ్జాజ్‌అహ్మద్, భానుప్రకాష్, లక్ష్మీ నరసింహారెడ్డి, రక్షణ్ పాల్గొన్నారు.

పంట బీమాకు ఈ క్రాప్ తప్పనిసరి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

పెట్టుబడులు పెట్టి సాగుచేసిన పంటకు బీమా పొందాలంటే తప్పనిసరిగా ఈ క్రాఫ్ నమోదు చేసుకొని ఈకేవైసీ చేసి ఉండాలని వ్యవసాయశాఖ అధికార్లు సూచిస్తున్నారు. ఆరుగాళం కష్టించి పండించిన పంట చేతికొస్తుందో లేదో.... తెలియని పరస్థితి వాతావరణం అనుకూలించక అతివృష్టి, అనావృష్టి కారణాల వల్ల రైతుకు పంట చేతికందకపోతే ప్రభుత్వం అందించే పంట బీమానే అదుకుంటుంది. పండిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది. ఈ ప్రయోజనం పొందాలంటే ఈకేవైసి తప్పనిసరి చేసింది. ఈ ఏడాది చిత్తూరు జిల్లాలో ఖరీఫ్ సాగు 91,360 హెక్టార్లలో సాగు చేశారు. ఈ క్రాప్ నమోదు చిత్తూరు జిల్లాలో 46,104 మంది నమోదు చేసుకున్నారు. ఈ లెక్కన దాదాపు 20 శాతం మంది ఖరీఫ్ రైతులు నమోదు చేసుకోలేదు. గత అంటే సెప్టెంబర్ 30వ తేదీ నాటికి పంట బీమా ఈ క్రాప్ నమోదు గడువు ముగిసింది. ఈ క్రాప్ నమోదు కోసం సెప్టెంబర్ 20వ తేదీ వరకు అవకాశమివ్వాలని ఖరీఫ్ రైతులు కోరుతున్నారు.

ఈ క్రాప్ వల్ల ప్రయోజనం

రైతులు వేసిన పంటల వివరాలు నమోదుతో పాటు ఈ కైవైసీ చేయించుకుంటే ఉచిత పంటల బీమా, పెట్టుబడి రాయితీ, మద్దతు ధర, పంట ఉత్పత్తుల కొనుగోలు వంటి ప్రయోజనాలు పొందవచ్చు. వ్యవయసాయశాఖ నుంచి వచ్చే అన్ని పథకాలు, రాయితీలు పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే వర్తిస్తాయి. అవగాహన లోపం ఈ క్రాప్ నమోదుపై రైతులు ఆసక్తి చూపకపోవడానికి గల కారణాలు తెలుస్తోంది. ప్రభుత్వం ఈక్రాప్ నమోదు గడువు పెంచాలని జిల్లాలోని రైతులు కోరుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ వరసగా కురుస్తున్న వర్షాలతో పంటదిగుబడి తగ్గే అవకాశం ఉన్నట్లు రైతులు అంచనా వేస్తున్నారు. పెట్టుబడి కూడా వచ్చే అవకాశం లేదంటున్నారు. ప్రభుత్వం నుండీ పొందే సాయం పొందాలంటే ఈ క్రాప్ నమోదు ఈ కేవైసి తప్పనిసరి కావడంతో ఈ క్రాప్ నమోదు గడువు పెంచాలని కోరుతున్నారు.



ఈ క్రాప్ నమోదు చేసుకుంటున్న వ్యవసాయశాఖ సిబ్బంది

జిల్లా వైద్య ఆరోగ్య సలహా మండలి

సభ్యులుగా చంద్రశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి- పెద్దపంజాణి: జిల్లా వైద్యఆరోగ్య సలహా మండలి సభ్యులుగా రాయలపేటకు చెందిన వైసిపి సీనియర్ నాయకులు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి నియమించినట్లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లా పరిషత్ ప్రతిపాదనలు, ఆదేశాల మేరకు వైద్య, ఆరోగ్య శాఖకు సంబంధించి సూచనలు, సలహాలు ఇవ్వటానికి నియమించినట్లు ఆయన తెలిపారు. ఈ సలహా మండలి సభ్యులుగా నియామకానికి కషి చేసిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వ్యక్తిత్వ వికాస శిక్షకులుగా

కరణం లక్ష్మి ప్రసాద్



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: వ్యక్తిత్వ వికాస శిక్షకులుగా ఆకులకొత్తూరు గ్రామంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కరణం లక్ష్మీ ప్రసాద్ ప్రశంసాపత్రం అందుకున్నారు. ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 30రోజుల శిక్షణ అనంతరం సికింద్రాబాద్‌లోని మినర్వా గ్రాండ్ హోటల్‌లో ఫౌండర్ గంప నాగేశ్వరావు ఆధ్వర్యంలో ప్రముఖ సినీ నటుడు కెవి ప్రదీప్, ఇంఛార్జి కోఆర్డినేటర్ రామచంద్రుడు, మాధవిల చేతులమీదుగా సర్టిఫికెట్ అందుకున్నారు. కరణం లక్ష్మీప్రసాద్ గతంలో లెక్చరర్‌గా విద్యార్థులకు సేవలందించారు. ప్రస్తుతం ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపిపిఎస్ ఆకులకొత్తూరు పాఠశాలలో ఎస్‌జిటిగా పనిచేస్తున్నారు. ఈసందర్భంగా ఆయన్ను మండల విద్యాశాఖ అధికారులు సాయి లీలా, సుబ్రహ్మణ్యం అభినందించారు.

కళ్యాణ మండపం నిర్మాణానికి విరాళం



విరాళం ధర్మకర్తకు అందజేస్తున్న దాతలు

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమలలోని స్వయంబీశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా నిర్మించబడుతున్న కళ్యాణ మండపం నిర్మాణం కోసం దాతల నుంచి విరివిగా విరాళాలు అందుతున్నాయి. మంగళవారం ఆలయ ధర్మకర్త సోమశేఖర్‌కు ఎస్.నడింపల్లి పంచాయతీ కరకమంద గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ లలితమ్మ, భర్త వాసుదేవయ్య దంపతుల కుమారుడు ఉదయ్ కుమార్, భార్య నిరోష్మి, కుమార్తె సహస్రలు రూ.50వేల నగదును అందజేశారు. అదేవిధంగా రూ.2లక్షలు విలువ చేసే గ్రానైట్ బండలు ఉచితంగా పరిచేందుకు తమ్మిశెట్టి సోమశేఖర్ ముందుకు వచ్చారు. అనంతరం వాసుదేవయ్యను ఆలయ ధర్మకర్త కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ముని వెంకటప్ప, శెట్టివారి జగన్మోహన్, శంకర, సిద్ధమల్లయ్య, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'మా ప్రాణాలకు రక్షణ కల్పించండి'

పోలీసు స్టేషన్‌లో దళితుల ఫిర్యాదు

ప్రజాశక్తి- పూతలపట్టు: మండలం మద్దులయ్యగారిపల్లె గ్రామానికి చెందిన ఉష, బాలయ్య దంపతులు పూతలపట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మీడియాతో మాట్లాడుతూ పేట అగ్రహారం పంచాయతీ పరిధిలో ఉన్న తమ భూమిలో ఎన్నో సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నామని అయితే మంగళవారం ఉదయం ఐదు గంటల ప్రాంతంలో పేట అగ్రహారం, పూతలపట్టులకు చెందిన ఆర్ముగం, సచివాలయ సర్వేర్ నరసింహులు, రిటైర్డ్ కరణం నాగరాజు పెళ్లై మరో ఇద్దరితో కలిసి మా భూమిని ఆక్రమించుకునేందుకు గతంలో ప్రయత్నం చేశారని తెలిపారు. ఈ విషయంపై రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానంలో వాదనలు, కేసు విచారణ జరుగుతుండగానే పై వ్యక్తులు ట్రాక్టర్ ద్వారా పొలం దున్నుతుండగా వెళ్లి అడ్డుకున్నందుకు వారు మా పైకి రాళ్లతో దాడి చేసి, తోసి వేశారని తెలిపారు. దళితులమంటూ అసభ్య పదజాలంతో మమ్మల్ని దూషిస్తూ మమ్మల్ని చంపేందుకు కట్టెలు, రాడ్లు తీసుకుని రావడం జరిగిందని తెలిపారు. దీంతో భయాందోళన గురైన బిక్కుబిక్కుమంటూ ఇంట్లోనే ఉన్నామని, ప్రస్తుతం మా కుటుంబ సభ్యులు ధైర్యం చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. స్థానిక ఎస్సై అందుబాటులో లేకపోవడంతో ఫిర్యాదు పత్రం పోలీస్ స్టేషన్లో అందజేశామని తెలిపారు. పోలీసులు తగు రక్షణ కల్పించాలని వారిపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.


సమస్యల పరిష్కారమే గ్రామసభ లక్ష్యం



కార్వేటినగరం గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ ధనంజయవర్మ

ప్రజాశక్తి- కార్వేటినగరం: సమస్యల పరిష్కారం కోసమే గ్రామాల్లో నిర్వహించే గ్రామసభ లక్ష్యమని మేజర్ పంచాయతీ కార్వేటినగరం సర్పంచ్ ధనంజయవర్మ అన్నారు. మంగళవారం సచివాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను పరిష్కరించుకోవడానికి గ్రామసభలు ఎంతో దోహద పడుతుందని తెలిపారు. వార్డుల మెంబర్లు తమ ప్రాంతాల్లో ఉన్న సమస్యలను గుర్తించి సమావేశం దష్టికి తీసుకొచ్చినప్పుడే ఆ సమస్యకు పరిష్కార మార్గం లభిస్తోందని చెప్పారు. అనంతరం సమస్యలపై పలువురు అందించిన వినతులను స్వీకరించి పరిష్కారానికి ఆమోదం తెలిపారు. అలాగే పంచాయతీలో చేపట్టాల్సిన పలు అభివద్ధి పనులపై పంచాయతీ తీర్మానాన్ని ఆమోదించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శేషాద్రి, ఎంపీటీసీ వెంకటేష్, పంచాయతీ ఈవో పీ.ఎస్ మణి, కార్యదర్శి సెల్వి విజయశ్రీ వార్డు మెంబర్లు, గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని గంగినాయనపల్లి గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ ఆచారి అధ్యక్షతన మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రేణుక శంకర్‌రెడ్డి మాట్లాడుతూ వివిధ శాఖలలో పనిచేస్తున్న సచివాలయ సిబ్బంది గురించి ప్రజలకు తెలియపరుస్తూ ప్రజల సమస్యలు ఏమైనా ఉంటే నేరుగా తమ దష్టికి తీసుకురావాలని తెలిపారు. అలాగే నాలుగు గ్రామాలలో నూతన డ్రైనేజ్ కాలువలు ఏర్పాటు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అనంతరం గంగినాయన పల్లి నూతన ఎస్సీ కాలనీకి కరెంటు లేక ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజలు సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యను సర్పంచ్, ఎంపీపీ ఎం.రెడ్డప్ప విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి 20కి పైగా కరెంటు పోల్స్ నూతన సింగల్ ఫేస్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామసభ అనంతరం ట్రాక్టర్ సహాయంతో నూతన పంచాయతీ కార్యాలయం నుండి బీసీ కాలనీ మీదుగా ఎస్సీకాలనీ వరకు కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడం జరిగిందని రెండు మూడు రోజుల్లో విద్యుత్ సరఫరా అందించనున్నట్లు తెలిపారు.



బైరెడ్డిపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ రేణుక శంకర్‌రెడ్డి

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరం ఆర్కేఎస్సార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ పి.స్వరూప వత్తి విద్య విద్యార్థులకు మంగళవారం ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థిలు కళాశాలలో నిర్వహించే స్టడీ అవర్‌కు హాజరు కావాలని తెలిపారు. కళాశాల టైమింగ్స్‌ను పాటించలని చదవడం ద్వారా ఉన్నతమైన ఫలితాలు సాధించాలని సూచించారు. ప్రతి ఒక్కరు యూనిఫామ్ తప్పనిసరిగా వేసుకొని రావాలని విద్యార్థులకు తెలిపారు. ఉన్నత ఫలితాలు సాధించాలని ప్రతి లెక్చరర్‌కు 15మంది విద్యార్థులను కేటాయించి ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపన్యాసాలు కే.రమేష్, డాక్టర్ మాధవ నాయుడు, కిషోర్ కుమార్, సిబ్బంది బంగారయ్య, రమేష్, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రతిపక్షాలపై అక్రమ కేసులు, దాడులను తిప్పి కొడతాం

చంద్రబాబుకు మద్దతు 25వ రోజు సిపిఐ దీక్షలు



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్రంలో అప్రజాస్వామిక, అరాచక పాలనకు పరాకాష్టే ప్రతిపక్ష నేతపైన అక్రమ కేసులు, అరెస్టులని సిపిఐ నేతలు దుయ్యబట్టారు. మంగళవారం చిత్తూరు సిపిఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ 25వ రోజు చేపట్టిన నిరాహార దీక్షలో జిల్లా కమిటీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మేము సైతం బాబు అండ అంటూ, సాయంత్రం వరకు నిరసన దీక్షలో కొనసాగించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్. నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతుందని ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా ఖూనీ చేయడం, ప్రజా ఉద్యమాలను చేయడం పరిపాటిగా మారిందని ధ్వజమెత్తారు. ప్రజా వ్యతిరేక చర్యలను ప్రశ్నిస్తూ, ప్రజల్లో పలుకుబడి పెరగడం వలనే ప్రతిపక్ష నేత పైన అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారని తెలిపారు. ఎన్నికల్లో డబ్బు, అధికారాన్ని, కండ బలాన్ని ఉపయోగించి మరోసారి గెలవాలని దుర్బుద్ధికి వ్యతిరేకంగా ప్రజలు ముక్తకంఠంతో ఎదిరించి పోరాడడం శుభ పరిణామని పేర్కొన్నారు. ప్రజా ఉద్యమాలకు పోరాటాలకు సిపిఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలియజేశారు. మాజీ ఎమ్మెల్సీ బి.రాజసింహులు, నగర మాజీ మేయర్ కటారి హేమలత, కోదండన్ సుబ్రమణ్యం, గోపీనాథ్, మార్ కొండయ్య, దాసరి చంద్ర పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలంలోని పాతగుంట పంచాయతీలో చంద్ర బాబు అక్రమ అరెస్టును వ్యతిరేకిస్తూ మంగళవారం జిల్లా యువత వైస్ ప్రెసిడెంట్ చంద్రబాబు రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎంపీటీసీలు నాథముని నాయుడు, మునిజ్యోతి, కుమార్, బాబు నాయుడు, కార్తిక్, శివప్రసాద్ నాయుడు, బాలాజీ రెడ్డి, సునీల్ నాయుడు, దేవేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ చాంద్ బాషను మాజీ మంత్రి అమరనాథ రెడ్డి మంగళవారం పరామర్శించారు. చాంద్ బాష తల్లి కమురున్నిస్సా మరణించడంతో స్థానిక తెలుగుదేశం పార్టీ నేతలతో కలసి మాజీమంత్రి చాంద్ బాష కుటుంబ సభ్యులను కలసి పరామర్శించి ప్రగాడ సానుభూనుతిని తెలిపారు. ఆయన వెంట ఖాజాపీర్, నాగరాజు, మాబాషా, అమానుల్లా, హనీఫ్, అశ్రఫ్, చిన్ని, సురేంద్ర ఉన్నారు.

పెద్దపంజాణి: మండలంలోని బొమ్మరాజుపల్లి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నాగరాజు రెడ్డి, భాస్కర్ రెడ్డి తల్లి మునెమ్మ మరణించారని తెలుసుకున్న మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి గ్రామానికి చేరుకొని భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.



పెద్దపంజాణిలో మునెమ్మ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

పరీక్షా కేంద్రాల్లో ఎంఈఓ తనిఖీలు



ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న ఎఫ్ఏ- 2 పరీక్షలను ఎంఈఓ కాణిపాకం ఆంజనేయులు శెట్టి తనిఖీ చేశారు. ఈసందర్భంగా మండలంలో మంగళవారం వీరకనెల్లూరు, పేటనత్తం, అగరమంగళం పాఠశాలలను పరీక్ష జరుగుతున్న తీరును తనిఖీ చేశారు. అదేవిధంగా స్కూల్ రికార్డులను మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈఓ తనిఖీ చేశారు. ఎంఈఓ తో పాటు టీచర్ బాబు నాయుడు ఉన్నారు.

డిగ్రీ కళాశాలలో రక్త గ్రూపుల పరీక్ష



ప్రజాశక్తి- వెదురుకుప్పం: డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఐక్యూఏసీ ఆధ్వర్యంలో రీజనల్ రెడ్ క్రాస్ సెంటర్, జంతుశాస్త్ర విభాగం సంయుక్తంగా రక్తగ్రూపుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 40 మంది విద్యార్థులు, సిబ్బంది పాల్గొని తమ రక్త గ్రూపులను తెలుసుకున్నారు. ఈకార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నపూర్ణ శారద ప్రారంభించి మాట్లాడారు. రక్త గ్రూపులు తెలుసుకోవడం చాలా ముఖ్యమని, రక్త గ్రూపులు తెలియకపోతే, రక్తమార్పిడి సమయంలో సమస్యలు తలెత్తే అవకాశముందన్నారు. అందువల్ల, ప్రతిఒక్కరూ తమ రక్త గ్రూపులు తెలుసుకోవడం చాలా అవసరమన్నారు. రీజనల్ రెడ్‌క్రాస్ సెంటర్ వైద్యులు రక్త గ్రూపులు గురించి వివరించారు. ఈ కార్యక్రమం అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

మునస్వామి నాయుడుకి నివాళి

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండలంలోని వివిపురం పంచాయతీ సేకూరి ఇండ్లు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మండల రైతు ప్రధాన కార్యదర్శి బోడపటి బాలాజీ నాయుడు తండ్రి బోడపాటి మునస్వామి నాయుడు అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న టిడిపి గంగాధర్ నెల్లూరు నియోజకవర్గం మాజీ ఇంచార్జ్ భీమనేని చిట్టిబాబు నాయుడు, మండల అధ్యక్షులు గంధం నేని జయశంకర్ నాయుడు, పలువురు సీనియర్ నాయకులు భౌతికాయానికి నివాళులర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి వెంట నాయకులు సిద్దయ్య శెట్టి, వేమన్న నాయుడు, మహబూబ్ బాషా, పుల్లూరు దాము, పైనేని ధనంజయ నాయుడు, చిట్టిరెడ్డి, దేవరాజులు, సూరి ఉన్నారు.

సిమెంటు బస్తాల వితరణ

ప్రజాశక్తి- నగరి : పట్టణ పరిధిలోని నేత్రదేవత దేశమ్మ ఆలయానికి ఎలక్ట్రికల్ అసోసియేషన్ వారు సిమెంటు బస్తాలను వితరణగా అందించారు. గంగ జాతరకు విచ్చేసే భక్తులకు మజ్జిగ పంపిణీ నిమిత్తం అసోసియేషన్ సభ్యులు ఇచ్చిన విరాళాల్లో మిగిలిన మొత్తంను గ్రామదేవతకు ఖర్చుచేయడానికి అసోసియేషన్ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షులు ఎన్‌సీ ఆనంద్‌కుమార్ మంగళవారం 12 సిమెంటు బస్తాలను ఆలయ కమిటీ అధ్యక్షులు వేణుబాబుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ రవి,కేపే కుమార్, అరుణగిరి, దామోదరం, ప్రభు, ఆలయ అర్చకులు నీలకంఠం, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఆటో డ్రైవర్ల జీవితాల్లో వెలుగులు'

ప్రజాశక్తి- పుంగనూరు: జగనన్న 'వాహన మిత్ర'తో ఆటోడ్రైవర్ల జీవితాలలో వెలుగులు నింపడమే రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని ఎస్సీ సెల్ నాయకులు రాజు అన్నారు. పట్టణంలోని స్థానిక ఇందిరా సర్కిల్ వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంట్ సభ్యులు మిథున్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం మంగళవారం చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకష్టాలను ప్రజాసంకల్పయాత్రలో స్వయంగా తెలుసుకున్న సీఎం జగన్మోహన్ రెడ్డి వాహన మిత్ర ద్వారా ఆటో డ్రైవర్ల ఖాతాలలో రూ.10వేలు జమ చేయడం జరిగిందన్నారు.

బస్సులో డబ్బా... ఎందుకు?



ప్రజాశక్తి- వెదురుకుప్పం: బస్సులో కండక్టర్ సీటు ముందు భాగంలో ఒక డబ్బాను అమర్చారు.. అదీ హుండీ టైపులో పెట్టారు ఆర్టీసీ వారు. మండలంలోని తిరుపతి – పల్లిపట్లు మార్గంలోని ఆర్టీసీ బస్సులు ఈ డబ్బా ఎందుకు అమర్చారో తెలీక ప్రయాణికులు చర్చించు కుంటున్నారు. దీని గురించి బస్సులోని కండెక్టర్‌ను అడుగగా తనకే తెలీదని అంటుంటే డ్రైవర్ మాత్రం మీరు ప్రయాణించి టికెట్ వెనుక మీ ఫోన్ నంబర్ రాసి దిగే ముందు ఆ డబ్బాలో వేయమని చెబుతున్నారు. అసలు ఈ డబ్బా ఎందుకు పెట్టారో.. ఏమీటిలో అంటూనే ప్రయాణికులు ఆర్టీసీకి ముడుపులు ఏమైనా చెల్లించాలా అంటూ చమక్కులు విసురుతున్నారు..

రికార్డులు లేకుంటే వేలం : ఎస్సై

ప్రజాశక్తి- సోమల: 2020వ సంవత్సరంలో అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడ్డ ద్విచక్ర వాహనాలను యజమానులు గుర్తించి సరియైన రికార్డులు తీసుకువస్తే సదరు ద్విచక్ర వాహనాలను యజమానులకు అందజేయడం జరుగుతుందని సోమల ఎస్సై వెంకట నరసింహులు తెలిపారు. ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ టీవీఎస్ ఎక్సెల్, సుజుకి మ్యాక్స్ 100 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సంబంధిత ద్విచక్ర వాహనాల యజమానుల చిరునామా కోసం ఎంతో ప్రయత్నించామని, ఇప్పటికైనా వాహన యజమానులు తమ రికార్డులను తీసుకువచ్చి సోమల పోలీస్‌స్టేషన్లో సమర్పించి తమ వాహనాలను తీసుకు వెళ్ళవచ్చునని తెలిపారు. లేనిపక్షంలో బహిరంగ వేలం ద్వారా వాహనాలను వేలం వేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

శ్మశానానికి దారి కల్పించాలని వినతి

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో సుమారు 200 కుటుంబాలు జీవిస్తున్నారు. తరతరాలుగా ఉన్న శ్మశాన వాటికకు దారి లేకపోవడంతో మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలోని గ్రామ రెవెన్యూ అధికారి రాజేష్‌కి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి శ్మశానికి దారి సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గృహనిర్మాణాలు వేగవంతం చేయాలి

ఎంపీపీ ఈశ్వరయ్య

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమలకు సమీపంలోని టీటీడీ కళ్యాణ మండపం వద్ద జగనన్న లేఔట్‌లో గహ నిర్మాణాలను ఎంపీపీ ఈశ్వరయ్య, ఎంపీడీవో నాగరాజు, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ కుమార్ మంగళవారం తనిఖీచేసి లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. సకాలంలో బిల్లులు చెల్లించడం లేదా, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కషి చేయాలని హౌసింగ్ సిబ్బందికి ఎంపీడీవో ఆదేశించారు. కార్యక్రమంలో వాలంటీర్లు, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపిపి ఈశ్వరయ్య

టిటిడి ఎలక్ట్రిక్ బస్సు చోరీ నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి -తిరుమల: తిరుమలలో రెండు కోట్ల విలువైన శ్రీ వారి ఉచిత ఎలక్ట్రిక్ బస్సు చోరీ కేసును పోలీసులు ఎట్టకేలకు చేధించారు. సెప్టెంబర్ 24న బ్రహ్మోత్సవాల సమయంలో తిరుమలలో ఎలక్ట్రికల్ బస్సు అపహరణకు గురైంది. టీటీడీ అధికారుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు అక్టోబర్ 2 వ తేదీన తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో దొంగను పట్టుకున్నారు. నిందితుని నుంచి దొంగిలించిన ఎలక్ట్రికల్ బస్సు తాళం చెవిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు మహారాష్ట్రకు చెందిన నిలావర్ విష్ణుగా గుర్తించారు. అతని తల్లి దండ్రులు హైదరాబాద్ లో నివసించేవారు. అయితే విష్ణు తల్లిని అతని తండ్రిని 2015లో హత్య చేసి జైలు శిక్ష అనుభవిస్తున్నాడు. అనంతరం ముద్దాయి విష్ణు, అతని అక్కను హైదరాబాద్ పోలీసులు సైదాబాద్ ప్రభుత్వ బాలల సంరక్షణ కేంద్రంలో చేర్పించారు. 2020 సంవత్సరంలో పదవ తరగతి పరీక్షలు రాసిన అనంతరం డాన్ బాస్కో చేతివత్తులు నేర్పించే కేంద్రానికి తరలించారు. అయితే 2021 సంవత్సరంలో విష్ణు సైకిల్ దొంగతనం చేసి పారిపోయాడు. అప్పటి నుంచి జల్సాలకు అలవాటు పడిన ముద్దాయి పలు నేరాలకు పాల్పడినట్లు తమ విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలోనూ తిరుమలకు వచ్చిన ముద్దాయి.. యాత్రికుల బస్సులో ఫ్రీగా తిరుగుతూ.. అదను చూసుకొని బస్సును దొంగిలించాడు. ఎలాంటి ఆధారాలు లేని కేసును చేధించడంలో ప్రతిభ చూపిన అదనపు ఎస్పీ విమల కుమారి , తిరుపతి క్రైమ్ డిఎస్పి రవికుమార్,తిరుమల వన్ టౌన్ సిఐ జగన్మోహన్ రెడ్డి క్రైమ్ సిఐ అమర్నాథరెడ్డి, క్రైమ్ పార్టీ సిబ్బంది ఏఎస్ఐ నాగరాజు, హెచ్ సిలు నాగరాజు, రవి ప్రకాష్ పిసీలు వేణుగోపాల్ నాగరాజు శెట్టి వారిని జిల్లా ఎస్పీ పి.పరమేశ్వర రెడ్డి అభినందించి రివార్డులు ప్రకటించారు.

'రీసెర్చి ఫెలోషిప్' అమలు చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నందు పరిశోధన చేస్తున్న ఫెలోషిప్ లేని పరిశోధక విద్యార్థులకు యూనివర్శిటీ రీసెర్చ్ ఫెలోషిప్ పథకాన్ని అమలు చేయాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నాయకులు మంగళవారం శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.రాజారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాధవ్ మాట్లాడుతూ వెనుకబడిన బడిన రాయలసీమ ప్రాంతంలోని ప్రతిష్టాత్మకమైన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నందు పరిశోధన చేస్తున్న ఆర్ట్స్, హ్యూమానిటీస్, కామర్స్ అండ్ మేనేజ్మెంట్ విద్యార్థులు అనేక మంది పరిశోధన భతి లేకపోవడం తో కనీసం మెస్ లకు వెళ్ళి భోజనం చేయడానికి సాహసించక అర్థాకలితో తమ పరిశోధనలు కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇదే రాష్ట్రంలో ఉన్న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం లో ఫెలోషిప్ లేని విద్యార్థులకు యూనివర్శిటీ రీసెర్చ్ ఫెలోషిప్ పథకం కింద నెలకు 5వేలు పరిశోధక భతి ఇస్తున్నారని తెలిపారు. వీసీ స్పందిస్తూ పాలకమండలి సమావేశంలో చర్చించి పథకం అమలు అయ్యేలా తన వంతు బాధ్యతను నెరవేరుస్తానని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రవి, ఉపాధ్యక్షులు అక్బర్, అశోక్, తేజ, నాయకులు శివ, వెంకటేష్, భరత్, విజయ్ ఉన్నారు.



అడవినే నమ్ముకున్నాం

మా బతుకులతో ఆడుకోవద్దు

కొత్త దుకాణాలు ఏర్పాటు చేయొద్దు
పాపవినాశనం షికారీల వేడుకోలు

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

ఎన్నో ఏళ్లుగా తిరుమలలోని పాపవినాశనంకు వచ్చే యాత్రికులనే నమ్ముకొని జీవనం సాగిస్తున్నామని, కొత్త దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారనే సమాచారంతో తిరుమల పాపవినాశనంలో దుకాణాలు నిర్వహించే షికారీలు, స్థానిక దుకాణదారులు మంగళవారం స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేసి తిరుపతి కపిలతీర్థం వద్ద గల అటవీశాఖ కార్యాలయం వద్ద జిల్లా అటవిశాఖ అధికారికి తమ గోడును వినిపించారు. దశాబ్దాల కాలంగా అడవిలో దొరికే చిన్న వేర్లు, పుష్పాలను అమ్ముకుంటున్న తమను అడవిలో వేర్లు తీయవద్దని, పూసలు వంటి వస్తువులనే విక్రయించుకోవాలని అటవీశాఖ అధికారులే చెప్పారని షికారీలు తెలిపారు. ఇన్నేళ్లుగా ఎటువంటి వివాదాలు లేకుండా వ్యాపారాలు చేసుకుంటున్న తరుణంలో ఉన్నట్టుండి కొత్త దుకాణాలకు అనుమతులు వచ్చాయని, చిన్నపాటి చెక్కఅరలను ఏర్పాటు చేయ్యడానికి కొలతలు తీసుకున్నారని, కొలతలు తీసుకున్న వారిని ఎదురించే ధైర్యం లేక ఇలా జిల్లా అటవిశాఖ అధికారికి చెప్పుకోవడానికి ఇంత మంది అంగళ్ళను మూసి వచ్చామన్నారు. షికారీలుగా తాము గత నాలుగు ఐదు దశాబ్దాలుగా పాపవినాశనంలోనే ఉంటూ అడవికి రక్షణగా నిలుస్తూ బతుకుతున్నామని, ఇప్పుడు అటవిశాఖ ఉన్నతాధికారులు ఇచ్చిన ఆర్డర్ ద్వారా ఇప్పటికి అంగళ్లు కలిగిన వారినే పేదవారిగా ఎలా నిర్ధారించారో అర్థం కావడం లేదన్నారు. వాస్తవానికి గతంలో తమ ఆర్థిక పరిస్థితిపై అధికారులే విచారణ చేసి దాదాపు 80 కుటుంబాల వారు నిరుపేదలుగా అధికారులే నిర్ధారించారని తెలిపారు. తమ బతుకులు దెబ్బతినేలా జిల్లా అటవీశాఖ అధికారి చర్యలు తీసుకోరని, ఆయనపై తమకు విశ్వాసం ఉందన్నారు.



స్థలంలేని చోట....సదాశివం, దుకాణదారుడు



పాపవినాశనంలో ఇప్పటికే దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి స్థలం లేదని, ఇప్పుడు 37 మందికి దుకాణాలు ఏర్పాటు చేయిస్తే ఇప్పటి వరకు చాలీచాలని సంపాదనతో బతుకుతున్న మేము ఏమి చేయాలి. అధికారులు మా పరిస్థితిని ఆలోచించి సముచిత నిర్ణయాన్ని తీసుకోవాలి.

పాపవినాశనంనే నమ్ముకున్నాం : కందన్



తరాతరాలుగా పాపవినాశనంనే నమ్ముకొని బతుకీడుస్తున్న మమల్ని ఇక్కడి నుండి తరిమేయాలని ప్రయత్నాలు చేస్తున్నారా అనే అనుమానాలు ఉన్నాయి. గతంలో డిఎఫ్ఓ సతీష్ రెడ్డి కొత్త దుకాణాన్ని అడ్డుకున్నారు. ఇప్పుడు మాకు న్యాయం చేయాలి.

మమల్ని తొలగించే శక్తి వారికుంది

వేల్ మురగన్, షికారీల నాయకుడు(తలైవర్).



అడవినే నమ్ముకుని జీవిస్తున్న మమల్ని అక్కడ నుండి తొలగించేశక్తి ఇప్పుడు కొత్త దుకాణాలు ఏర్పాటు చేసుకోనే వారికి ఉంది. అడవికి నిప్పు అంటుకున్నా, అక్రమదారులు అడవిలోకి చొరబడుతున్నా అడ్డుకుని అడవిని కాపాడుతున్నాం. మాకు పర్మిషన్ వచ్చింది. మేము ఎక్కడైనా షాపులు పెడతామంటే మేము ఏమి కావాలి, మా కుటుంబాలు ఏమి కావాలి. అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలి..